క్లుప్తంగా

వరి విత్తనాలు సిద్ధం

అయిజ: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేస్తున్న ఆర్‌ఎన్‌ఆర్, సోనా మసూరి వరి విత్తనాలు రైతులకు విక్రయించేందుకు సింగిల్ విండో కార్యాలయంలో సిద్ధంగా ఉన్నాయని పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎన్‌ఆర్ 25 కేజీల ప్యాకెట్ రూ. 1094, సోనా మసూరి 25 కేజీల ప్యాకెట్ రూ. 1083కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వడ్ల ప్యాకెట్లు కావాల్సిన వారు ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తం జిరాక్స్ కాపీలను తీసుకరావాలని సూచించారు. వరి ప్యాకెట్లు కొనుగోలు చేసినవారు సింగిల్ విండో కార్యాలయం ఇచ్చే రశీదు, బస్తాకు ఉండే గ్యారంటీ కార్డును భద్రంగా తీసుకోవాలని సూచించారు. విత్తనాల నాణ్యతలో లోపముంటే రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థను సంప్రదించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన మొద్దుల రాముడు శనివారం అకాల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: మున్సిపాలిటీలోని బుడగ జంగాల కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. చిన్ని పాటి వర్షానికి కాలనీలో వర్షంనీరు నిలిచిపోతుందని, మురుగునీరు దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. దోమల ఉధృతి ఎక్కువగా ఉండడంతో కాలనీ ప్రజలు అనారోగ్యం పాలవులతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని, ముఖ్యంగా పాములు ఇండ్లలోకి వస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మానవత్వం చాటిన ఎస్‌ఐ



మానవపాడు: ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాలకు శనివారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి మార్గ మధ్యలో దయ్యాల వాగు సమీపంలో అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి రోడ్డుపై పడ్డాడు. అదే మార్గంలో పోలీస్ ఉన్నతాధికారుల సమావేశానికి మానవపాడు మండలం నుంచి గద్వాలకు ఎస్‌ఐ చంద్రకాంత్, సిబ్బందితో వెళ్తున్నాడు. దయ్యాల వాగు దగ్గర కిందపడ్డ వ్యక్తిని గమనించి మూర్ఛ వచ్చినట్లు గమనించారు. తాళాలు చేతిలో పెట్టి ఆ వ్యక్తి సాధారణ స్థితికి వచ్చేంతవరకు అక్కడే ఉన్నారు. వ్యక్తి సాధారణ స్థితికి రాగానే గద్వాలకు వెళ్లిపోయారు. దీంతో పలువురు ఎస్‌ఐ చంద్రకాంత్‌ను అభినందించారు.

రామోజీరావుకు ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్: రామోజీరావు మరణం సినీ రంగానికి, మీడియా రంగానికి తీరని లోటని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. రామోజీరావు మృతి చెందడంతో శనివారం జిల్లా కేంద్రంలో, అయిజలో, శాంతినగర్‌లో, ఎర్రవల్లి చౌరస్తాలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉన్నారు.



ఉపాధిలో మహిళలే అధికం



ఇర్కిచేడులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- గ్రామాల్లో జోరుగా పనులు
- పేదలకు ఆసరాగా ఉపాధి హామీ
- సద్వినియోగం చేసుకుంటున్న పేదలు

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలుస్తోంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఆదుకుంటోంది. అడిగిందే తడవుగా అధికారులు కూలీలకు జాబ్‌కార్డులను జారీ చేస్తూ పని కల్పిస్తున్నారు. రెండు నెలలుగా కేటీదొడ్డి మండలంలోని ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పనులు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు అధికారులు జాబ్‌కార్డులు అందజేస్తూ పనులు కల్పిస్తున్నారు. మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో మహిళా కూలీలు అధికంగా పాల్గొంటున్నారు. పురుషులు, వ్యవసాయం, ఇతరత్రా పనులు చేస్తుండగా మహిళలకు ఉపాధిహామీ పనులు వరంగా మారాయి. వేసవిలో వ్యవసాయం పనులు అంతగా లేకపోవడంతో మహిళా కూలీలు అధిక సంఖ్యలో ఉపాధి పనులకు వెళ్తున్నారు. మండుతున్న ఎండలను సైతం లేక్క చేయకుండా పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్త్రీ, పురుషులనే భేదం లేకుండా పనిదినాలు కల్పిస్తుండటంతో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో పనులు చేస్తున్నారు.

కుటుంబ అవసరాలకు ఉపయోగం..



ఇటీవల ప్రభుత్వం ఈజీఎస్ కూలీ రూ.300 పెంచింది. ఉపాధి పనులపై సంపాదించే మొత్తంలో కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. కొంత మొత్తం పొదుపు చేస్తున్నారు. ఉదయం పనికి వెళ్లి ఎండరాక ముందే ఇంటికి వస్తున్నాం.

– గోవిందమ్మ, ఉపాధి కూలీ

జోరుగా ఉపాధి హామీ పనులు..

రెండు నెలలుగా మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున్న ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. కేటీదొడ్డి మండలంలోని గతేడాది మొత్తం 6900 జాబ్ కార్డులు ఉండగా, ఈ ఏడాది 7389 పెరిగాయి. మండలంలోని రోజు వారీగా నాలుగు వేల మంది కూలీలు పనిచేస్తున్నారు. ఈ సంవత్సరం చెరువుల్లో కుంటల్లో, కాల్వల్లో పూడికతీత, నర్సరీల్లో మొక్కల పెంపకం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం, పండ్ల మొక్కల పెంపకం, పొలాల్లో గట్ల నిర్మాణం తదితర పనులను ఉపాధి హామీ ద్వారా చేపడుతున్నారు. ఉదయం 7గంటల వరకే ఇంటి వద్ద పనులు ముగించుకుని ఉపాధి హామీ పనులకు తరలి వెళ్తున్నారు. మండలంలో 7,389 కార్డులుండగా, 13,666 మంది కూలీలున్నారు. ఇందులో 5వేల మంది మహిళలున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,66,546 పనిదినాలు కల్పించారు. మండలంలో రూ.2 కోట్ల అంచనాలతో ఉపాధి పనులు చేపడుతుండగా ఈ సంవత్సరం రెండు నెలల్లో రూ.కోటి మేర పనులు చేపట్టారు.

సద్వినియోగం చేసుకుంటున్నారు..

ఉపాధి హామీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యల్లో పాల్గొంటున్నారు. మండంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో పనులు వేగంగా పనులు జరుగుతున్నాయి. పనుల్లో మహిళలే అధికంగా హాజరవుతున్నారు. పనులకు లక్ష్యం మేరకు పూర్తి చేస్తున్నారు.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఏఐసీసీ కార్యదర్శికి నేతల సన్మానం



అలంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేసిన ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను పలువురు నేతలు సన్మానించారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను అలంపూర్ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, సీనియర్ నాయకులు జాన్, మద్దిలేటి, సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్దబాలు శనివారం కలిసినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి అలంపూర్ నియోజవకర్గంలో మెజార్టీ రావడానికి కృషి చేసిన ఏఐసీసీ కార్యదర్శిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి సొంత కాలనీలోని బూత్ నెంబర్ 272లో బీఆర్‌ఎస్‌కు 352 రాగా, కాంగ్రెస్‌కు 554 ఓట్లు రావడంతో స్థానిక నేతలను ఏఐసీసీ కార్యదర్శి అభినందించారు. సంతోష్‌నగర్ కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా కాంగ్రెస్‌కు అత్యధిక ఓట్లు సాధించడానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను త్వరలో గాంధీ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

టోల్ ఉద్యోగుల వేతనాలు పెంచండి

అలంపూర్: టోల్‌ప్లాజా ఉద్యోగులకు వేతనాలు పెంచాలని టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనిన్ సభ్యులు కోరారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు శనివారం టోల్ ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ బాలగణేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పుల్లూరు టోల్‌ప్లాజాలో 12 ఏళ్లుగా 77 మంది ఉద్యోగులు వివిధ స్థాయిలో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 16వ తేదీ నుంచి టోల్‌ప్లాజా ఉద్యోగులు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు పీటర్, మద్దయ్య, వెంకట్రాముడు, లాజర్, వెంకటేష్, శేషన్న, రాజశేఖర్ ఉన్నారు.



టోల్‌ప్లాజాలో ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

కుటుంబ ఆరోగ్య వివరాల నమోదు



గట్టులో కుటుంబ ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంటున్న ఆశా వర్కర్లు

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆశా వర్కర్లు కుటుంబ ఆరోగ్య వివరాల నమోదు కార్యక్రమాన్ని చురుకుగా చేపడుతున్నారు. ఇందులో భాగంగానే శనివారం మండల కేంద్రంలో ఆశా వర్కర్లు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను ఇంటింటికి వెళ్లి నమోదు చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్‌లో భాగంగా 30 ఏళ్ల పై బడిన వారందరికి ఇంటి దగ్గర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించనున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పద్మ, మంజల, హారతి, రంగమ్మ, సరస్వతి, సరళ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

టీబీని అంతం చేయడమే లక్ష్యం

రాజోళి: టీబీ వ్యాధిని సమూలంగా అంతం చేయడమే లక్ష్యమని టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని తుమ్మిళ్లలో ఆయన వైద్య బృందంతో కలిసి ఇంటింటికి తిరిగి టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. దగ్గు, గల్ల పడటం, తలనొప్పి, జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చేసే గల్ల పరీక్ష ద్వారా టీబీ వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని, దానికి ఉచితంగా మందుల పంపిణీ, పౌష్టికాహారం కోసం ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. టీబీ వచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మహమ్మారిని తరిమేసేందుకు, వైద్యుల సలహాలు పాటిస్తే చాలన్నారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్, రామలక్ష్మి, రాజేశ్వరి, జగన్మాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మిళ్లలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భారీ వర్షం.. పొంగిన వాగులు



అలంపూర్‌లో నిండుగా ప్రవహిస్తున్న జోగుళాంబ వాగు

అలంపూర్: ముందస్తు వర్షాలు అన్నదాతలకు ఊరట కలిగిస్తున్నాయి. భారీగా కురుస్తున్న వార్షాలతో వాతావరణం చల్లబడి వేసవితాపాన్ని క్రమంగా తగ్గిస్తోంది. అలంపూర్‌లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం సైతం వర్షం దంచికొట్టింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు పొంగిపొరుతున్నాయి. అలంపూర్ మున్సిపాలిటీలో భారీగా వర్షం కురవడంతో జోగుళాంబ వాగు వరద నీటితో పొంగిప్రవహిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం కురవడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలంపూర్‌-భైరన్‌పల్లిలో భారీ వర్షంతో మార్గంలో ఉన్న వాగు పొంగి రోడ్డుపైకి నీళ్లు చేరాయి. వాగుపై ఉన్న కల్వర్టు రంధ్రాల్లో చెత్తాచెదారం చేరి వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేక రోడ్డుపైకి ప్రవహిస్తున్నాయి. ఈ మార్గంలో వాహనదారులు వాగు దాటడానికి నిరీక్షించాల్సి వచ్చింది. వర్షాకాలంలో కల్వర్టుల వద్ద వరద నీరు పొంగి రోడ్లపైకి చేరకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో భారీ వర్షాలకు మురుగు కాల్వల ద్వారా వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో రోడ్లపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అలంపూర్‌లో రోడ్లపైకి చేరిన మురుగు నీరు

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య

శాంతినగర్: తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని స్థానిక సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ మమత రవి శనివారం ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. తల్లిగాని, తండ్రిగాని ఎవరో ఒకరు లేకపోయినా వారి పిల్లలకు ఫీజులో సగం వరకు రాయితీ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు లేకుంటే విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఉంటుందని, వారి విద్యాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. పదో తరగతి వరకు ఉచిత విద్య అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు లేని వారికి ఎంత మందికైనా ఉచితంగా విద్య అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కరస్పాండెంట్ కోరారు.

మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

గద్వాలన్యూటౌన్: 2024–26 ఆర్థిక సంవత్సరాలకు గద్వాల కమీషన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ మోహన్, సంయుక్త కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా తారనాథ్, కార్యవర్గసభ్యులుగా ఆంజనేయులు, కిషోర్‌కుమార్, నర్సింహులు, రామకృష్ణ, రామయ్య, సవారన్న, శంకర్, ఆర్‌టీ శంకర్‌లు ఎన్నికయ్యారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తకోట బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11మంది పిల్లలు బడి మానేయడంతో వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి బడిలో చేర్పించేందుకు ఆసక్తి కలిగించారు. అనంతరం హెచ్‌ఎం నర్సమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, పుస్తకాలు ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గీతాబాయి, మాధవి, విజయ, నాగమణి, ప్రభావతి తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు గోప్లాపూర్, రేమద్దుల, కొత్తపేట, శాగాపూర్ గ్రామాల్లోని ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీలు నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు.

పెబ్బేరు రూరల్: ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో బడి బయటి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు హెచ్‌ఎం గణేష్‌కుమార్ తెలిపారు. వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి గ్రామ శివారులోని చేపల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి విద్య ప్రాధాన్యత గురించి వివరించారు.

చెట్లపూలతో రోడ్లకు కొత్తందం



గద్వాల-రాయచూర్ రహదారిలో రోడ్డుకు ఇరు వైపుల పూసిన పూలు

ధరూరు: గద్వాల–రాయచూర్ రహదారికి ఇరు వైపుల నాటిన సుబాబుల్ చెట్లకు పూలుపూసి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. మొన్నటి వరకు ఎండలతో ఆకులు రాలిపోయి, కళావిహీనంగా కనిపించిన చెట్లు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెట్లు పచ్చగా మారి ఎర్రటి పూలుపూసి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రెండు మూడు రోజులుగా ఈ రోడ్డు గుండా వెళ్తున్న బాటసారులు చెట్లకు పూసిన పూలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు.

ఉపాధ్యాయుల సమావేశాలకు ఆటంకాలే!



ఉండవెల్లిలోని తరగతి గదిలో పేర్చిన పాఠ్యపుస్తకాలు

ఎంఈఓ భవనం ఉన్నా.. లేనట్టే

- ఎమ్మార్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయం నిర్వాహణ
- పాఠశాలలో పుస్తకాలు.. ప్రైవేట్ బిల్డింగ్‌లో మీటింగ్‌లు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో మండల విద్యాశాఖ కార్యాలయం ఉంది. కానీ ఐదేళ్లుగా ఎంఈఓ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అధికారులకు అప్పగించారు. ఉపాధ్యాయులకు సమావేశం ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తారు. మరోసారి ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేస్తారు. దీంతో ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది.

మండలంలో 22 పాఠశాలలు

మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 12 ప్రైమరీ పాఠశాలలు, 5 మండల పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 255 మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించే వారు ఉన్నారు. వారికి సరైన అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాలయాలు మంజూరు చేసింది. మండల వనరుల కేంద్రం నిర్మించింది. నిర్మించిన మూడు నెలలకే మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని అందులోకి మార్చారు. కలెక్టర్ ఉత్తర్వులతో ఎంఆర్‌సీ భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయంగా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. 10 ఏళ్లు పూర్తయిన ఎంపీడీఓ కార్యాలయానికి స్థలం చూపక అక్కడే ఉండడంతో ఉపాధ్యాయుల సమావేశాలు ప్రైవేట్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, వారి పరిస్థితులు, నిర్మాణ బిల్లులకు భవనాన్ని ఎంఈఓకు అందజేయాలని, ఇబ్బందులు తొలుగుతాయని కోరుతున్నారు.



ఉండవెల్లిలోని ఎంఆర్‌సీలో ఎంపీడీఓ కార్యాలయ భవనం

భవనం ఇవ్వాలని అడుగుతున్నాం..

కొన్నేళ్లుగా భవనాన్ని కేటాయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉపాధ్యాయులకు ఎక్కడా సమావేశాలు నిర్వహించడానికి వీలు లేదు. బడిబాట, కార్యక్రమం, తదితర అంశాలపై చర్చించాలంటే ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసుకుంటున్నాం. ఉపాధ్యాయుల సమావేశాలకు ఎంఆర్‌సీ భవనాన్ని అందజేయాలి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శివ ప్రసాద్, ఎంఈఓ, ఉండవెల్లి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

గద్వాల రూరల్: గద్వాల మండలం గుంటిపల్లి గ్రామానికి చెందిన యువరైతు రాజు పిడుగుపాటుకు గురై మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే గుంటిపల్లిలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణానికి చెందిన కంసలి భరత్ గుండెపోటుతో మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన సంతాపాన్ని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, రమేష్‌నాయుడు రఘు, మునిస్వామి ఉన్నారు.

గద్వాలపట్టణం 29వ వార్డుకు చెందిన కంసలిభరత్ గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కౌన్సిలర్ కృష్ణ, ఈశ్వర్, రంజిత్, జనార్దన్‌రెడ్డి, క్రాంతి, తదితరులు ఉన్నారు.